కను విప్పు!

శ్రీ చెలసాని ప్రసాదరావు

వంతెనకు నాలుగయిదు గజాల దూరంలో బస్సు ఆగింది. కండక్టరు హెచ్చరికతో లేచి, బట్టలు దులుపుకుంటూ బస్సు దిగాను. ఇలా దిగానో లేదో, అలా బస్సు వెనకాలే వస్తూ సుడిగాలిలో మీద విరుచుకుపడ్డ దుమ్ము మేఘాల తాకిడికి ఉక్కిరి, బిక్కిరై జేబురుమాలు తీసి ముక్కు కడ్డం పెట్టుకుని, పైనుంచి క్లీన రందించిన పెట్టె దింపుకుని ప్రక్కకు తప్పుకున్నాను.

హారన్ మరోసారి కొట్టి కదలిన బస్సు వెనకాల పరుగెత్తుతూ వెంటాడుతున్న దుమ్ము మేఘాలచాటున క్షణంలో అదృశ్యమయింది.

పెట్టె క్రిందపెట్టి, మరోసారి బట్టలు సరిజేసుకొని, జేబురుమాలుతో మొహం తుడుచుకుంటూ ఓసారి చుట్టూరా చూశాను.

కనుచూపుమేరలో ఎక్కడా ఊరున్న జాడ లేదు. నరసంచారం అంతకన్నా లేదు. విస్తుపోతూ వంతెన ప్రక్కనే స్తంభం మీదున్న బోర్డును మరోసారి చదివాను. సందేహం లేదు. దిగవలసిన చోటే దిగాను. మరి ఊరెక్కడ? దారెటు?

మరోసారి నలువేపులా చూశాను. ఇప్పుడు బస్సు వచ్చిన రోడ్డొక్కటే కనుపిస్తున్నదల్లా. ఎదురుగా కాలువగట్టునే ఓచిన్న మట్టిరోడ్డు కాలువతో పాటే మెలికలు తిరుగుతూ పోతూ, కనుచూపు మేరవరకూ కనుపిస్తున్నది. బహుశా అదే ఊళ్లోకి దారి కావచ్చు. కాని, కంకరరోడ్డున కేవలివైపునకూడా కాలువగట్టుమీదుగానే మట్టిరోడ్డుంది. ఈ ఒకే మట్టి రోడ్డును రెండుగాచీలుస్తూ ఇంతకు ముందు బస్సు వచ్చిన కంకరరోడ్డుంది. ఈ రెండు దిక్కుల్లో ఏవైపుకు పోవాలో అర్థం గావటంలేదు. అయినా కనుచూపు మేరలో ఎక్కడా ఊరువున్న ఛాయలు కనుపించడం లేదు. అలాంటపుడు వెదుక్కుంటూ ఎంత దూరమని యీ పెట్టెను మోసుకుంటూ పోగలను.

ఈ అయోమయావస్థలో జనించిన విసుగుకాస్తా కరిగి అది రామారావుమీదికి కోపంగా మారసాగింది. వాడికి రెండు మూడురోజుల క్రిందట ఉత్తరం వ్రాశాను, వస్తున్న విషయం తెలుపుతూ. ఉత్తరం చూసుకుని చిరునవ్వుతో బస్‌స్టాండ్‌లో స్వాగత మిస్తాడనుకున్నాను. ఒకవేళ రాకపోయినా ఎవర్నడిగినా రామారావు ఇల్లు తెలుస్తుంది, ఊరంతటికీ ఒకడే డాక్టరుగదా. ఆ మాత్రం తెలీకుండా ఉంటుందా అనుకున్నాను. తీరాచూస్తే అడుగుదామన్నా ఎవరూ కనుపించరాయె. బస్‌స్టాండ్ సంగతలా ఉంచి ఊరేనా లేదాయె నిక్కడ.

రామారావెందుకు రాలేదో! ఓసారి రమ్మని ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాసినవాడు తీరావస్తే కలవక పోగా కనీసం మనిషినన్నా పంపలేదు. ఒకవేళ అర్జంట్ కేసేదన్నా తగిలిందేమో ననుకుంటే అలాంటపుడు ఎవరన్నా నౌకర్నైనా పంపవచ్చే! అదీలేదు. నేనిక్కడిలా ఈ ఎండలోనించుని ఏం చేసేటట్టు? ఇలా ఎంతసేపు దిక్కులుచూస్తూ నించోవటం?

చేసేదిలేక పెట్టెతీసుకుని దగ్గర్లో ఉన్న రావి చెట్టు నీడకు చేరుకుని పెట్టెక్రిందపెట్టి, దానిమీద చదికిలుపడి సిగరెట్ ముట్టించాను.

రామారావు ఎప్పుడూ ఇంతే! ఏదో ఒక తిక్క పని చేస్తుంటాడు. కాలేజీలో నాలుగేళ్ళు మేమిద్దరం కలిసే చదివాము. అప్పట్లో మేమిద్దరం అతిసన్నిహితంగా ఉండే వాళ్ళం. రోజూ కలిసి కాలేజీకి వెళ్ళే వాళ్ళం. కలిసి వచ్చేవాళ్ళం. పరీక్షుల రోజుల్లో సరే సరి. రాత్రింబవళ్ళు మా యింట్లోనే మకాం. క్లాసు పుస్తకాలన్నీ ముందేసుకుని నూరి, నూరి సారం పిండి పరీక్షలకు తయారు అయేవాళ్ళం. అసలా రోజులే వేరు! ఆ నాటి మా మిత్రత్వాన్నిచూసి మా కిద్దరికీ కృష్ణార్జునులని నామకరణం చేయటంకూడా జరిగింది. అయితే స్వభావరీత్యా మా యిద్దరికీ చాలా తేడా ఉంది. ఆశయాలు, ఆదర్శాలూ ఒకటే అయినా నేను కేవలం పుస్తకాల పురుగుని. రామారావుకు చదువులో ఎంత అశ్రద్ధో, బయటి విషయాలలోకూడా అంత అశ్రద్ధా ఉండేది! ఆ రోజుల్లో కాలేజీలో రామా

రావు పేరు మోగిపోతూండేది. కాలేజీ మీటింగుల్లో రామారావు ఉపన్యాసం విధిగా ఉండి తీరేది. సంఘ సంస్కరణ విషయంలో అతను తీవ్రభావాలు గలవాడని నలుగుర్లోనూ పేరుండేది. వాటిని తన ఉపన్యాసాలలో విద్యార్థులకు నూరిపోస్తుండేవాడు. ఆ ఊపుతోనే ఒక సంవత్సరం కాలేజీ యూనియన్‌కు ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడుకూడా.

అలాంటిది రామారావు కాలేజీ చదువు పూర్తి కాగానే హఠాత్తుగా మా కెవరికీ చెప్పకుండా పదిహేను వేల కట్నం పుచ్చుకొని పెళ్లి చేసుకున్నాడన్న వార్త విన్నప్పుడు నిర్ఘాంతపోయాను. పిడుగుపాటు తిన్న వటవృక్షంలా నిలువెల్ల కంపించి పోయాను.

ఎంత నిజమనుకున్నా ఎందుకనో ఆ మాట నమ్మలేక పోయాను. ఎలా నమ్మను మరి?

ఆ మాట నాతో చెప్పిన వ్యక్తిని అబద్ధాలాడుతున్నావనీ, రామారావుమీద దుష్ప్రచారం చేస్తున్నావనీ నిందించానంటే, నడిరోడ్డుమీద తిట్లవర్షంతో ముంచెత్తానంటే అది నాతప్పెలా అవుతుంది?

వరకట్నాలను వ్యతిరేకించే రామారావు పదిహేను వేలుకట్నం పుచ్చుకున్నాడంటే నమ్మశక్యమా?

కాని, నేను విన్నది అబద్ధంకాదని తెలుసుకోవటానికి ఎంతో కాలం పట్టలేదు.

చిత్రమేమంటే ఆతర్వాత రామారావు మళ్లీ నాక్కనిపించలేదు. పెళ్ళి జరిగిన రెండురోజులకు శుభలేఖమాత్రం పోస్టులోవచ్చింది నాపేర.

ఆతరువాత మూడేళ్ళకు నేను ఉద్యోగరీత్యా క్యాంపుకు వెళ్తూంటే జంక్షన్లో కనిపించాడు రామారావు. నావంక సందేహంగా చూస్తూంటే నేనేవెళ్ళి పలుకరించాను. కుశలప్రశ్నలయ్యే లోగానే గంట మ్రోగింది. నేను రామారావును వదలకతప్పలేదు. అడగాలనుకున్నవన్నీ నాలిక అంచునే నిలబడిపోయాయి. బెంగుళూరులో మెడిసిన్ చదువుతున్నానని అతను చెప్పినమాటలనుమాత్రం చెవిన వేసుకొని కదుల్తున్న రైలులోకి దూకాను.

ఆతరువాత మేమిద్దరం కలుసుకోవటంజరుగలేదు. మళ్లీ ఏడాదిక్రితం బస్ స్టాండులో కనుపించి వ్యవధిలేక అడ్రసిచ్చి ఉత్తరం వ్రాయమని చెప్పి బస్సెక్కి వెళ్లిపోయాడు. అంతే.

కాలేజీరోజులనాటి మా స్నేహం ఎదురుగా ఉన్నంతసేపూ వెలిగి దూరమువగానే ఆరిపోయే సాధారణ స్నేహంకాదు. ఒకేరకమైన భావాలూ, ఆశలూగల ఇద్దరువ్యక్తుల మధ్య పెరిగే సన్నిహితత్వంతోనూ, ఆత్మీయతతోనూ పెనవైచుకొన్నదది. అందువల్లనే ఇంతకాలంగా మేమిద్దరం దూర దూరంగా వున్నా మా మిత్రత్వంమాత్రం మరింత సన్నిహితమయిందేగాని తగ్గలేదు. రామారావు చదువూ, ట్రైనింగూ పూర్తిజేసుకుని ఉద్యోగంలో చేరి దాదాపు ఏడాదవుతూంది. స్వంతంగా ప్రాక్టీసు పెట్టడానికి తగినంత డబ్బులేనందువల్ల ప్రస్తుతానికి గవర్నమెంటు హాస్పటల్లో చేరుతున్నానని రామారావే రాశాడు. 'ఇక్కడి వాతావరణం బాగుంటుంది. ఓసారి తప్పకరా! వారం రోజులుండి పోదువుగాని.' అని ప్రతి ఉత్తరంలోనూ ఆహ్వానిస్తున్నాడు. నాకుకూడా గ్రామీణ వాతావరణమంటే ఏదో చెప్పలేని ఆకర్షణ. నేనూ పల్లెటూళ్లో పుట్టి పెరిగిన వాణ్ణే. కాలక్రమేణా పల్లెకుదూరమై పట్నవాసంలో పడ్డా మనసుమాత్రం తరుచు ఆ చిన్ననాటి స్మరణలతో పల్లె వాతావరణంలో విహరిస్తూనే ఉంటుంది. అక్కడి జీవితంలోని మాధుర్యం, మనుష్యుల్లోని నిర్మలత, వాతావరణంలోని స్వచ్ఛత, పట్నవాసంలో యాంత్రిక జీవనంతో విసుగెత్తిపోయిన నన్ను బలంగా ఆకర్షిస్తునే ఉంటాయి. అందుకనే రామారావును చూసినట్లూ అవుతుందని వారంరోజులు సెలవు సంపాదించి యిలా బయలుదేరాను. మళ్లీ ఏడాది తరువాత ఇప్పుడు రామారావును చూడబోతున్నాను. తీరికగా వారంరోజులు అతనితో గడప బోతున్నాను. ఇంతకాలంగా నన్ను తికమకల్లో ముంచిన అతని ప్రవర్తనలోగల అంతరాన్ని అతని ముఖతా తెలుసుకోబోతున్నాను.

మనసు రెక్కలువిప్పుకొని ఎగిరెగిరి వెళ్లి రామారావు ముందు వ్రాలుతున్నది.

వాచీచూసుకొన్నాను. పన్నెండు గంటలయింది. అప్పుడే ఎండ మండిపోతూంది. అసలే ప్రయాణపు బడలికలో ఉన్నానేమో, విపరీతంగా దాహం వేస్తూంది. ప్రక్కనే కాలువఉన్నా, అందులో ఎండి, ఎండి నెర్రెలు విచ్చిన వండ్రుమట్టి తప్ప నీటి చుక్క ఎక్కడా కనపడటంలేదు. అక్కడక్కడా చిన్న చిన్న గుంటల్లో నీరున్నా అదంతా బురదమయం. నీటి సంగతలా ఉంచి యిక్కడ యిలా యింకెంతసేపుం

టాలో, ముందేం చేయాలో తోచటంలేదు. ఊళ్ళోకి పోవటం ఎలాగ? రామారావును కలుసుకునేదెప్పుడు?

పొలాల్లో ఎక్కడన్నా మోటబావి ఉండవచ్చునుకుంటూ కాస్త ముందుకు పోయి చూశాను. కాని ఎక్కడా అలాంటి సూచనలు లేవు. విసుగుతో వెనక్కి తిరిగి వస్తూంటే కాల్వకు అవతలి వైపున వంతెన ప్రక్కన గట్టుమీద గిలకబావి కనుపించి, రావిచెట్టుక్రింది పెట్టెనొకసారి చూసి బావివేపు నడచాను. బావి దగ్గరకు చేరుకుని నీరుందేమోనని వంగిచూచిన నాకు చల్లని గాలి క్రిందినుండి వచ్చి మొహాన కొట్టి సగం దాహం తీర్చినట్లయింది. ప్రక్కనే త్రాటికి బిగించి ఉన్న పాత డబ్బాతో నీళ్లు తోడుకున్నాను. ఆవేళలో బావినీళ్లు చల్లగా, తియ్యగా కొబ్బరినీళ్లలా తోచి తెలీకుండానే డబ్బాడు నీళ్లు గడగడా త్రాగేశాను.

సగం బరువు తగ్గినట్లయి, మొహంకూడా కడుక్కుని జేబురుమాలుతో తుడుచుకుంటూ వంతెన మీదికొచ్చాను.

దూరంగా బస్సు వచ్చిన వైపునుంచి ఒంటెద్దు బండి ఒకటి యిటే వస్తూన్నది. బండిని చూడటంతో ఇంతవరకూ రేగిన విసుగంతా పోయి మనసులో లీలగా ఆశారేఖ మెదలసాగింది. గబగబా రావిచెట్టుక్రిందికి చేరుకుని, పెట్టెవద్ద నుంచుని తీరాన్ని చేరుకోబోతున్న ఈతగాడిలా ఉత్సాహంగా ఆవైపే చూడసాగాను. బండివాడి నడిగితే ఊరెక్కడో తెలుస్తుంది. దారేదో తేలుతుంది. కాలుముందుకు సాగుతుంది.

“ఊళ్లోకివస్తారా ఏంటి బాబూ?” అనడిగాడు బండివాడు దగ్గరికి వస్తూనే నన్నూ, నా పెట్టెనూ చూస్తూ.

“బండి పోయేది ఊళ్లోకేనా?” అనడిగాను నేను. ఒకవేళ వాడు కాదంటే ఈ పెట్టె మోసుకుంటూ ఎలా పోవటమూ అని ఒక వంక భయపడుతూనే.

“అవును. ఎక్కండి బాబూ!” అంటూ బండిలో ఉన్న సామాన్లని ఓ ప్రక్కకి సర్ది చోటు చూపించాడు అతడు!

పెట్టె అతని కందించి లోపలికెక్కి కూర్చున్నాను. ఈ బండివాడెవడో గాని సమయానికివచ్చాడు. లేకపోతే ఈ ఎండలో, వడగాలిలో అలా ఎంతసేపు పడిగాపులు పడాల్సివచ్చేదో ననుకుంటూ అతనివంక చూశాను. అతడు వృద్ధుడు. మనిషి బాగా వంగిపోయాడు. కాని మొహంలో మాత్రం ఎక్కడా ముడతలు లేవు. ఒకప్పుడు మంచి బలిష్ఠుడని అతనికదలికలే చెపుతున్నాయి. కుడిచేతిలోని పగ్గాలు విదలించి, ‘ఎహెయ్’ అంటూ ఎడమచేత్తో గిత్తవీపుమీద చరిచాడు. బండి కదిలింది. కాలువగట్టూనే ఉన్న మట్టిరోడ్డుమీదుగా బండి ముందుగా సాగుతున్నది. కాలువకిరువేపులా గట్టుమీద దగ్గరదగ్గరగా వరుసగా పెద్దపెద్ద వృక్షాలున్నాయి. మట్టిరోడ్డుమీద ఎక్కడా ఎండపొడలేదు. పొలాలమీదుగా వస్తున్న వేడిగాలి దట్టంగా పెరిగి, ఎక్కడా ఎడంకుండా అల్లుకుపోయిన చెట్లను చీల్చుకునిమాదాకావచ్చేసరికి చల్లబడిపోతూంది ఆ కాలువగట్టుమీద వాతావరణంఅంతా చల్లగా, హాయిగా ఉంది. పట్నంలో నేనెన్నడూ ఫ్యాన్ల క్రిందగాని, వట్టివేరు తడికల మాటునగాని. యిలాంటి చల్లదనాన్ని అనుభవించి ఉండలేదు.

బండి మెల్లగా ముందుకు సాగుతూంది. వంతెన క్రమక్రమంగా వెనక్కి నడుస్తూంది. ఇలా ప్రయాణించి గమ్యస్థానాని కెప్పుడు చేరుకుంటానో? రామారావును కలుసుకోవటానికి ఇంకా ఎంతసేపో? నేను వెళ్లేసరికి రామారావు ఒకవేళ ఊళ్ళో లేకపోతే?...

“ఇదుగో, ఊరు ఇంకా ఎంతదూర ముంటుం దిక్కడికి?” అనడిగాను బండివాణ్ణి.

“రెండు మైళ్ళుంటది బాబూ!” అన్నాడు తను ఇటు చూడకుండానే.

“అయితే ఊళ్ళోకి సరాసరి బస్సేనా లేదేమిటి? మరీ అంత చిన్న ఊరా?”

“సిన్నదంటారేటి బాబూ! ఊళ్ళో రెండు రైసుమిలులుండాయి. మూడు వేల గడపుంటది. ఇస్కూలుంటది. ఊరింకా సిన్నదంటారేటి?” అన్నాడతను నావంక చూస్తూ.

బండి కుదుపుకు వళ్లు హూనమవుతున్నది. అసలే మట్టిరోడ్డు. దానికి తోడు దారినిండా గుంటలు. మధ్య మధ్య బండి ఎగిరెగిరి పడుతున్నది. విసుక్కుంటూ మూలనున్న గడ్డి ఇంకొంచెం తీసి క్రింద వేసుకుని సర్దుకు కూర్చున్నాను.

“మరి ఊళ్లోకి బస్సేనా లేదేమిటోయ్! పెద్ద ఊరేనంటున్నావుగదా!” అనడిగాను, బండి కుదుపులికి దెబ్బ తగులకుండా జాగ్రత్తపడుతూ.

“ఊళ్ళోకి బస్సు లేదు బాబూ. ఇందాక మీరొచ్చిన బస్సులో రెండూళ్ళ తర్వాత దిగితే, అక్కడి నుంచి కంకర రోడ్డుంటది. ఆదార్న ఊళ్లోకి మూడు మైళ్ళు. ఊళ్లోకి వచ్చేలారీలు, కార్లు అన్నీ ఆదార్నే వస్తయ్.” అన్నాడు వాడు.

“అంత పెద్ద ఊరికి చుట్టుదారేం ఖర్మమోయ్. ఈమట్టి రోడ్డుకి కంకర వేయిస్తే సరిపోనుగా” అన్నాను.

జవాబుగా నిట్టూర్చాడతను. “అదంతా ఓ పెద్ద గొడవ బాబూ. అంతా పెద్ద మడుసుల యవహారం. మాబోటోళ్ల మాటినే దెవరు? అన్నాడు.

“ఏమిటది?” అనడిగాన్నేను కుతూహలాన్నాపుకోలేకపోతూ.

“ఆ రామదాసుగారికీ, వెంకట్రాయ్యగారికీ పడదు బాబూ. ఆల్లిద్దరూ రెండు పార్టీలు. ఎప్పుడూ ఏదో గొడవే. దెబ్బలాటే. అందుకనే ఈదారిలా తగలడింది. ఆల్లకా యిరోధాలు లేకుండాలేగాని, కంకర రోడ్డేంటి? ఈదారంతా సిమెంటు యేయించరా?”

“వాళ్ళెవరు? వాళ్ళకీ ఈరోడ్డుకీ సంబంధమేమిటి?” అనడిగాను నేనాశ్చర్యపోతూ.

“మీరంటే కొత్తోళ్ళు గనుక మీకీ గొడవలేం తెలీవనుకోండి. కాని, ఊళ్ళో చిన్న పిల్లలకి కూడా ఆళ్ళ సంగతి బాగా తెల్సు. ఆ రామదాసుగోరు ఫ్యాక్టరీ ఓనరు. వెంకట్రామయ్యగారేమో పంచాయతి ప్రెసిడెంటు. ఆల్లిద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే మండకుండా ఉండదు. ఈరోడ్డు గనుక బాగుచేయిస్తిరా ఆ రామదాసుగోరికి లాభం. మిల్లుకొచ్చి పొయ్యే లారీలు చుట్టుదిరిగి రానక్కల్లేదు. కిరాయిలు తగ్గుతాయి. అందుకని ఆయన రోడ్డేయించాలంటాడు. ఈయనేమో పెత్తినమంతా సేతిలో పెట్టుకున్న మడిసాయె. ఆయ నేయించమంటున్నాడు గనుక ఈయ నేయించడు. అదీ గొడవ.” అన్నాడు బండివాడు నీరసంగా.

ఆశ్చర్యపోయాను నేను. అప్పటికీ, యిప్పటికీ ఎంత మార్పు! పల్లెల్లో కూడా రాజకీయాలింతగా బలిశాయా?

అంతలో నేనా తెలివి తక్కువతనం స్ఫురించి సిగ్గుపడ్డాను. నేను పల్లెప్రాంతాలకు వచ్చిదాదాపు పదేళ్ళవుతూంది. ఈ మధ్యకాలంలో ఎన్నెన్ని ఘటనలు జరుగలేదు. మార్పుకెంతకాలం కావాలి? నిజానికి నా చిన్నప్పుడు మా ఊళ్లోసైతం ఇలాంటి గొడవలే మరో రూపంలో అడపాదడపా రేగుతూనే ఉండేవి. కాని, పట్నవాతావరణాన్ని మించి యిక్కడ రాజకీయకక్షలూ, ముఠాతత్వాలూ పెరిగిపోవటం ఘోరమే.

బండివాడు తడకసందులోంచి చుట్టముక్క తీసి నిప్పుముట్టించి, పొగపీల్చి చుట్టచివరకొరికి తుపుక్కన ఊసి లోపలి కోసారి చూసి, తిరిగి మొదలెట్టాడు. “ఎందుకొచ్చిన రోషాలు బాబూ ఇవి! ఆళ్ళకా యిరోధాలు లేకుండాలేగాని ఊరెంత బాగుపడిపోను. కాని, ఆళ్ళకెంతసేపూ తమ పెత్తనాల గొడవే గాని, వూరిసంగతి పడితేనా! చేనుదగ్గర నీటితగాదా నించి వీసరగులు కట్టుకోడం దాకా రోజూ ఏదో పేచీయేనాయె. దెబ్బలాటేనాయె. ఈళ్ళిద్దరి యిరోధాల మధ్యా నలిగి చచ్చేదీ, బుర్రలు బద్దలు చేసుకునేదీ ఆళ్ళ పాలేర్లూ, నౌకర్లూనూ. ఆళ్ళకేం! ఆళ్లు మాత్రం శుభ్రంగా బతుకుతుంటారు. ఆ మధ్య మా పెద్దోడికాలు ఇరిగినంత పనయిందనుకోండి. ఆడికి రామదాసుగారి మిల్లులో నౌకరీలెండి. నీకెందుకురా ఈ గొడవలు—నీ పనేదో నువ్వు చూసుకోక అంటే వినడు. రామదాసుగోరంటే ఆడికేదో ఎర్రి అభిమానం. అందుకే అప్పుడప్పుడు దెబ్బలు తిని వస్తుంటాడు. ఈళ్ళిలా గుద్దులాడుకుంటూంటే మధ్యన డాక్టరేమో బాగుపడుతుంటాడు. అయినా నా మాటి నేదెవరు సెప్పండి. రేపో ఎల్లుండో పొయ్యేవాణ్ని. నామాటెవరు పట్టించుకుంటారులెండి. ఏదో యీనా డిలా బండి తోలుకొని నాకొడుకుల్ని అడగాల్సిన పనిలేకుండా నామానాన నేను బతుకుతుండాను. అయినా ఆళ్ళకే అనుభవమ్మీద తెలవాలి గాని నే చెబిత ఏముంటదిలెండి.” అన్నాడు బండివాడు నిట్టూరుస్తూ.

డాక్టరు ప్రసక్తి వచ్చేసరికి నా కుతూహలం మరింత పెరిగింది. డాక్టరు సంగతేదో అన్నావు. ఆయన కేమిటి?” అనడిగాను.

“అదా! యిక్కడో డాక్టరున్నాడు లెండి. పేరుకు గవర్నమెంటు డాక్టరయినా ఆస్పటల్లో సరిగా వైద్యం చెయ్యడు. ఆయనతో మంచిగా ఉండాలంటే యింటికెళ్ళి ముడుపుకట్టుకుని మందు తెచ్చుకోవాల్సిందే. ఈయనకన్నా ఆ పాతాయనే నయమనిపిస్తుండది. ఆమధ్య మా పెద్దోడికి దెబ్బలు బలుపుగా తగిల్తే డబ్బు తెమ్మన్నాడంట. చివరికి రామదాసుగోరు దగ్గరుండి అంతా చూస్తేనేగాని కట్టు

కట్టలేదంట. అందుకే మా పెద్దోడికి డాక్టరంటే మంట. గవర్నమెంటు దగ్గర జీతం పుచ్చుకుంటూ కూడా ఇంత నీలుగా - అంటాడువాడు. మా గూడెంలో అంతా డాక్టర్ని తిట్టిపోసేవాళ్లే. కాని, ఏం లాభం? పేదోడి కోపం పెదవికి చేటు గద బాబూ! మా మా టెవ రింటారు?" అన్నాడతను ఆవేశంతో, నిస్పృహతో.

బండతను చెపుతున్నది కొంపదీసి రామారావును గురించి కాదుగదా. అని అనుమానం వేసింది. రామారావే అయితే?...ఇంక ఆ విషయం ఊహించుకోలేక పోయాను.

బండి మలుపు తిరిగింది. ఊరి చివర కాలువ ప్రక్కనే చిన్న రైసుమిల్లు తెల్లగా, ఎత్తుగా కనుపిస్తూంది. మిల్లు ప్రక్కనే గుట్టలుగా పోసిఉన్న బియ్యపుచిట్టు ఊరు సరిగా కనపడకుండా అడ్డొస్తూంది. మిల్లు గొట్టంలోంచి నల్లగా, దట్టంగా వేస్తున్న పొగ పట్టణపు వాతావరణాన్నే స్ఫురింప జేస్తూంది.

బండివాడు లోపలికి తిరిగి నావంక చూసి వ్రేలితో మిల్లును చూపెట్టాడు. "అమిల్లేనండీ రామదాసుగోరిది. మా వా డక్కడే నౌఖరీ చేస్తూంట. అదిగో ఆ గుట్టలమాటుగా కనపడ్తుండదే, ఆ తెల్ల డాబాలోనే డాక్టరుగారుండేది."

"ఎవరా డాక్టరు? కొత్తగా వచ్చినాయనేనా?" అనడిగాను.

"అవునాయనే? ఊర్లో ఉన్నదీ ఈ ఒక్క డాక్టరూగద బాబూ. ఈయనొచ్చియాడాదిగడుస్తుండది. అయినా ఆయ నదృష్టం బాగుండెది. మంచి చోటుకొచ్చి పడింది." అన్నాడు.

నేనేమనలేదు. బండివాడు చెబుతున్నది రామారావుగురించేనన్నది నిశ్చయం. అతను చెప్పింది అబద్ధమనుకోటానికి వీల్లేదు. నాతో లేనిపోని విషయాలు కల్పించి చెప్పవలసిన అవసరం అతనికి లేదు. అయితే మరి రామారావు ఇలా ఎలా మారిపోయాడు. అతని కెంతలేదన్నా కనీసం మూడువందలు జీతం వస్తుందా! ఇంకా ఈ కక్కుర్తి ఏమిటి? ఆ సంగతలా ఉంచి, ఎన్నో ఉన్నతాశయాలు గల రామారావు ఈ దారిలో ఎలా దిగగలిగాడు?

"మీా రెక్కడ దిగుతారు బాబూ!" అన్న బండివాడి ప్రశ్నకు ఉలిక్కిపడ్డాను.

బండి ఊళ్లోకి వచ్చింది. మిల్లు ముందు రోడ్డు మీాదుగా పోతూంది. "బండి ఎటు వెళుతుంది?" అనడిగాను.

"మీారు దిగాల్సినందాక తోలతాను. ఎక్కడ దిగుతారో సెప్పండి." అన్నాడు.

క్షణ మాగి "సరే! డాక్టరుగారింటికి పోనియ్." అన్నాను.

నా జవాబుకు బండివాడు గుండుదెబ్బ తిన్నవాడిలా ఉలిక్కిపడి దిగ్గున వెనక్కి తిరిగి నా కళ్లలోకి సూటిగా చూశాడు.

"డాక్టరుగారు మీాకు బందుగులా ఏటిబాబూ?" అనడిగాడు.

"కాదు. స్నేహితుడులే." అన్నాను.

"నేనన్న మాటలు మనసులో పెట్టుకోకండి బాబూ! ఏదో నలుగురూ సెప్పుకునేవే నేనూ అన్నాను అంతే." అన్నాడతను.

బండి ఊళ్ళోకి ప్రవేశించింది. కొన్ని సందులు గడిచాక ఆ తెల్ల డాబాముందాగింది. కొత్తగా కట్టినట్లుందా డాబా. చుట్టూరా ప్రహారీఉంది. ఆమూలా, ఈమూలా పెద్దచెట్లున్నాయి. వాటిప్రక్కనే ఏవేవో చిన్న చెట్లున్నాయి. గేటు తెరుచుకుని లోపలికి అడుగు పెట్టాను. లోపల విశాలమైన ఆవరణమున్నది. అందులో రకరకాల పూలమొక్కలు నేత్రానందకరంగా తీర్చిదిద్దబడ్డాయి. మొత్తంమీాద యిల్లు ఓ చిన్న బంగాళాలా ఉంది.

బండివాడు పెట్టె తెచ్చి లోపల పెట్టాడు. పర్సుతీసి రూపాయిచ్చి వెళ్ళవచ్చునని సంజ్ఞ చేసి, వరండాలో వెళ్ళి మెల్లగా 'రామారావ్' అని కేక వేసి బూట్లు చప్పుడు చేశాను. కొద్దిసేపట్లో ఓ చిన్నపిల్ల తలుపు తెరచుకుని బయటకు తొంగిచూసి లోపలికిపోయింది. ఆవెంటనే రామారావు బయటికివచ్చాడు.

"ఓ! నువ్వా నారాయణా! ఇదేమిటి యిలా ఉత్తరం పత్తరంలేకుండా హఠాత్తుగా ఊడిపడ్డావ్! పట్నంనుంచేనా రావటం!" అన్నాడు ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరవుతూ, గబగబా ముందుకువచ్చి చేతులు పట్టుకుని కుర్చీలో కూర్చోబెడుతూ.

"అదేమి టలాగంటావ్! నా ఉత్తరం అందలేదా?" అన్నాను నేనూ ఆశ్చర్యపోతూ.

"ఏమిటీ? ఉత్తరం వ్రాశావా? మరి అందలేదే!" అన్నాడు రామారావు తెల్లబోతూ.

"మూడురోజుల క్రిందటే పోస్టు చేశానే. ఎందుకందలేదో!" అన్నాను.

జవాబుగా రామారావు విరగబడి నవ్వాడు. లోపలికి చూసి "అమ్మాయ్, మంచినీళ్ళు తీసుకురా." అని కేకవేసి ఇటు తిరిగాడు. "మంచిపనిచేశావు నారాయణా! ఆ ఉత్తరమేదో ఇంకో రెండురోజులు ముందుగా రాసిపడేస్తే బాగుండేది. నీ ఉత్తరాలు నాకందటానికి నాలుగయిదు రోజులు పడుతుంది తెలుసా?" అన్నాడు.

"తెలుస్తూనే ఉందిలే."

"ఏమిటి?"

"అదే."

"అదా. ఇది పట్నమూ గాదు. అలాగని పల్లెటూరూ కాదు. ఆ రెండు లక్షణాల సమ్మేళన మిది. అయినా కాలక్షేపానికేం కొదవలేదులే. అయితే ఇంతకీ ఎన్నిరోజులు సెలవుపెట్టావు?"

"కొద్దిరోజులు." అన్నాను నిర్లిప్తతతో.

లోపల్నుంచి ఇందాక కనుపించిన అమ్మాయి రెండుగ్లాసుల్తో మంచినీళ్ళు తెచ్చింది.

గ్లాసు అందుకుని అమ్మాయిని దగ్గరకు తీసుకుంటూ "ఎందరేమిటోయ్!" అనడిగాను నవ్వుతూ.

"ఇద్దరు. రెండోవాడు లోపల నిద్రబోతున్నాడు." అన్నాడు రామారావు నవ్వుతూనే.

"ఏమయినా నీలో గృహస్తలక్షణాలు బాగాబలిశాయి." అన్నాడు గతాన్ని నెమరువేసుకొంటూ.

"దానికేంలెద్దూ! పద, స్నానంచేసి భోంచేద్దువుగాని. ప్రయాణంలో బాగా అలసిపోయి ఉంటావు." అన్నాడు రామారావు లేస్తూ.

నేనూలేచి అమ్మాయి తెచ్చిన తుండుగుడ్డ అందుకొని రామారావువెంట లోపలికి పోయాను. లోపల ఇల్లంతా తీర్చిదిద్దినట్లుంది. గదులు విశాలంగా, పరిశుభ్రంగా ఉన్నాయి! "అద్దె ఎంత?" అని అడిగాను. "ముప్పైరూపాయలు. ఏం, బాగుందా?" అన్నాడు రామారావు. "బాగుండకపోవటమేమిటోయ్! పట్నంలో అయితే వందరూపాయలిచ్చినా ఇలాంటి ఇల్లు దొరకదు." అన్నాను రామారావు అదృష్టాన్ని మెచ్చుకుంటూ.

స్నానం, భోజనం పూర్తిచేసుకుని, వరండాలో వేసిన మంచంమీద మేనువాల్చి ‘‘అమ్మయ్య’ అనుకున్నాను. ప్రయాణబడలికవల్ల నిద్ర ముంచుకువస్తూన్నది. బండిప్రయాణంవల్లా, బస్సుప్రయాణంవల్లా వళ్లంతా తీపులు పెడుతూన్నది.

బయట ఎండ బాగా కాస్తున్నా ముందుభాగంలో చెట్లూ, మొక్కలూ ఉండడంవల్ల వరండాలో చల్లగానే ఉంది. మరికాసేపటికి రామారావుకూడా వచ్చి ప్రక్కమంచంమీద కూర్చున్నాడు.

రామారావును ఎన్నో అడగాలనుకున్నా. పాత విద్యార్థిజీవితంనాటి రోజుల్ని గురించి, తరువాతి కాలంలో అతని చదువునుగురించీ, ముఖ్యంగా నన్నమితాశ్చర్యంలో ముంచెత్తిన అతని వివాహాన్నిగురించీ, బండివాడు చెప్పిన సంగతుల్లోని వాస్తవాన్ని గురించీ, ఎన్నో అడగాలనుకొన్నా. కాని రామారావు ప్రదర్శిస్తున్న హుందాతనం అందుకు ఎడమీయలేదు. అడగటానికి నాకు ధైర్యం చాలలేదు. రామారావు అడిగిన వాటికి జవాబులిస్తూ ఏవేవో మామూలు విషయాలు మాట్లాడుకుంటూ నాకు తెలీకుండానే నిద్రలో పడ్డాను.

తిరిగి మెలకువ వచ్చేసరికి వాతావరణం బాగా చల్లబడింది. ప్రక్కమంచంమీద రామారావు లేడు. బయట గేటుదగ్గర ఒకతను నిలబడిలోనికి చూస్తున్నాడు. మనిషి బలంగా, దృఢంగా ఉన్నాడు. కండలు తిరిగిన వస్తాదుల్ని గుర్తుకు తెస్తూన్నాడు కాకీ నిక్కరు వేసుకున్నాడు. చేతులున్న బనియనులాంటిచొక్కా తొడుక్కొని లోపలికి దోపుకొన్నాడు. నిక్కరూ, చొక్కా కూడా నూనెమరకలతో మాసి అసహ్యంగావున్నాయి. మనిషి ఆందోళనగా లోనికి చూస్తున్నాడు. అతను వేసిన కేకకే నాకు మెలకువ వచ్చిందనుకుంటాను.

లోపలినుంచి రామారావు కూతురు వచ్చింది.

"అమ్మాయ్! నాన్న లోపల లేడా?" అనడిగాను. ‘లేరండి’ అంటూండగానే రామారావు ఎక్కడినుంచో స్టెతస్కోపు ఊపుకుంటూ వచ్చాడు. ఆ వచ్చిన అతను ప్రక్కకు తప్పుకుని నమస్కారం చేశాడు.

నిర్లక్ష్యంగా నమస్కారాన్నందుకుంటూ యేమిటన్నట్టు అతనివంక చూశాడు రామారావు.

"మీరు వెంటనే రావాలండీ. మా నాయనకు ప్రమాదంగా వుంది. ఇందాకటి వేళ బండి కట్టబోతూ

కాలు జారి పడ్డాడు. కాడి తొడమీద పడ్డది. అప్పట్నించి గిలగిల్లాడిపోతున్నాడు. కదల్లేడు. మెదల్లేడు మీరు వెంటనే వచ్చి చూడాలి." అన్నాడతను తొందర తొందరగా, తడుముకుంటూ మాట్లాడుతూ.

ఆ దృశ్యాన్ని నా మనస్సులో చిత్రించుకుంటున్నాను.

రామారావు వరండాలోకి వచ్చి అన్నాడు— "ఎప్పుడు పడితే అప్పుడు రావాలంటే ఎలా? ఇప్పుడు నాకు వీల్లేదు." అని.

"మనిషి గిలగిలాడిపోతున్నాడండీ. కాలు విరిగిందేమో తెలియదు. ఇలాగేవుంటే రేపటి దాకా బతికుంటాడనే నమ్మకం లేదు. తమరు దయయుంచి వెంటనే రావాలి." అన్నాడతను ప్రాధేయపడుతూ.

"ఇళ్ళచుట్టూ తిరగటం నా డ్యూటీకాదు." అన్నాడు రామారావు విసుగుతో.

ఏదో బీదవాళ్ళం మీ ఫీజేదో యిచ్చుకోకుండా ఉంటామా. దయదలచాలే." అన్నాడతను.

రామారావు ఇటు తిరిగి నావంక చూసి, తిరిగి కోపంగా అతనివంక చూశాడు. "అదేం లాభంలేదు. రేపు హాస్పటలు టైముకు అక్కడకు తీసుకురా." అని స్టెతస్కోపు ఊపుకుంటూ లోపలికిపోయాడు.

ఆ వచ్చినతను ఆగ్రహంతో పళ్ళు పటపట కొరుకుతూ, బయటికిపోతూ, పోతూ చూసిన చూపు నా గుండెల్లో ములుకులా దూసుకున్నది. ఆ మనిషి తలచుకుంటే నన్నూ, రామారావును చెరో చేతా ఎత్తి అవతల పడేయగలిగినంత బలంగా, దృఢంగా ఉన్నాడు. కాని, అంత లావుమనిషీ ధనం ముందు, అధికారం ముందు అల్పుడై తలవంచుకుపోయాడు.

రామారావు రెండు కప్పుల్తో కాఫీ పట్టుకొచ్చి నాకొక టిచ్చి ప్రక్కన కూర్చున్నాడు. మనిషి చాలా కోపంగా, ఆవేశంగా ఉన్నాడు. చేతిలో కాఫీ కప్పు వణికిపోతూన్నది.

మౌనంగా కాఫీ త్రాగటం పూర్తిచేసి కప్పు ప్రక్కనున్న స్టూలుమీద ఉంచాను. రామారావు కూడా పూర్తిచేసి లేచి "అలా షికారు వెళ్ళివద్దామా?" అన్నాడు డ్రెస్ సరిజేసుకుంటూ.

ఇద్దరం బయలుదేరాం. వాతావరణం పూర్తిగా చల్లబడింది. అప్పుడు సూర్యాస్తమయం. ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. దారిలో అక్కడక్కడా కొందరు రైతులు వీధలరుగులమీద కూర్చుని బాతాఖానీ వేస్తున్నారు. అందరి చూపులూ రామారావుప్రక్కన నడుస్తున్న నామీదనే ప్రసరిస్తున్నవి. కొందరు రామారావును పలుకరించి నమస్కారాలు చేశారు. రామారావు చిరునవ్వుతో ప్రతి నమస్కారాలు చేస్తున్నాడు.

అలా నడచి, నడచి ఊరి చివరిదాకా వచ్చాం. ఒక ప్రక్కన పెద్దచెరువుంది. చెరువుకు రెండువేపులా ఊరు. మిగతాదంతా పంట పొలాలు. చెరువుప్రక్క నుంచే పోయే రోడ్డును పట్టే పొలాలు, మామిడి, సపోటా తోటలు చూసుకొంటూ అలా చాలా దూరం పోయాం.

"ఇక్కడ కూర్చుందామా!" అన్నాడు రామారావు దగ్గర్లో ఉన్న కొండరాళ్ల గుట్టను చూపుతూ. 'అలాగే' నన్నాను. రామారావు దగ్గరున్న తోటలోకెళ్లి రెండు మామిడిపళ్లు కోయించుకొచ్చాడు. అవి తిని, బావినీరు త్రాగి తిరిగి రాళ్లగుట్ట దగ్గరి కొచ్చి కూర్చున్నాం.

రామారావును ఏమని పలుకరించాలో తోచలేదు. "మామిడి పళ్లు! బాగున్నాయ్! ఎంత?" అనడిగాను. ఏదో ఒకటి అనాలి గనుక.

"అవును. ఇవి ఈ ప్రాంతాలలో ప్రసిద్ధిపొందిన మేలిరకం పళ్లు. ఆ తోట వెంకట్రామయ్య గారిది. ఆయన పంచాయతీబోర్డు ప్రెసిడెంటు. వాళ్లతోటలో నా దగ్గర డబ్బు పుచ్చుకోరు." అన్నాడు రామారావు.

వెంకట్రామయ్య....మధ్యాహ్నం బండివాడు చెప్పినమాటలు గుర్తుకువచ్చాయి. వెంకట్రామయ్య... రామదాసు...డాక్టర్ ......అతను చెప్పినదాంట్లో అసత్యంలేదు. అందుకు ఇందాకటి సంఘటనే ఒక ప్రత్యక్షసాక్ష్యం. పోతూ, పోతూ ఇందాక అతను చూసిన చూపులోని అగ్నిజ్వాల కళ్లముందు భగ్గుమన్నది.

"ఇందాక ఆవచ్చిన అతనితో అలా ప్రవర్తించావేమిటి?" అనడిగాను రామారావును, అలా అనగూడదనుకుంటూనే.

"అదా! చాలా ఉందిలే. వాడొట్టి దగుల్బాజీ వెదవ. రామదాసు ముఠా మనిషి. ఆయన మిల్లులోనే పని చేస్తుంటాడు. అమధ్య వీడూ ఆ రాము

దానూ కలిసి హెల్తాఫీసరుతో నామీద ఏమేమో రిపోర్టు చేశారట." అన్నాడు రామారావు ఆగ్రహంతో.

"నీమీదా! రిపోర్టా! ఏమని?" అనడిగాను ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"ఏముంది! నేను సరిగా వైద్యం చెయ్యనట. డబ్బివ్వందే మందివ్వనట. ఇలాంటివే ఏవేవో చెప్పారట."

"అయితే అవి నిజం కాదన్నమాట."

జవాబుగా రామారావు బరువుగా నవ్వాడు, "అందులో కొంత నిజం లేకపోలేదు, నిప్పు లేకుండా పొగరాదుగదా." అన్నాడు. నాముందు తను అల్పుడైపోయినట్లు ఫీలవుతూ.

ఏమనాలో నాకు తోచలేదు. క్షణమాగి అన్నాను: "ఈ ఊబిలో కెందుకు దిగావు రామారావూ? నీకొచ్చే జీతం శుభ్రంగా సరిపోవటమే గాక ఇంకా ఎంతో కొంత మిగుల్తుందే."

"నీవనేదీ నిజమే. కాని జీవన గమనంలో మలుపులు తిరిగేటప్పుడు తగిలే కొన్ని ఎదురుదెబ్బలు కొన్ని సందర్భాల్లో మనుషుల్ని మారుస్తాయి."

క్షణమాగి రామారావ్ అన్నాడు. "మనం కలసి చదువుకున్న రోజులు గుర్తున్నాయా? ఆరోజుల్లో నేను డాక్టర్ కావాలని కలలుకంటుండే వాడిని. ఆ ఉద్దేశ్యంతోనే ఫస్ట్‌క్లాస్ కోసం రాత్రింబవళ్లూ కష్టపడి చదివే వాడిని కూడాను."

మా విద్యార్థిజీవితం నామనో నేత్రం ముందు లీలగా మెదిలింది! అవును అక్షరాలా నిజం - అనుకున్నాను మనసులో నే.

"ప్యాసయ్యానుకాని ఏం లాభం మెడికల్ కాలేజీలో సీటురాలేదు. ఇతరచోట్ల చూస్తే చందాలివ్వమన్నారు. డబ్బు! డబ్బు! డబ్బు! అంతా డబ్బు వ్యవహారం. సీటుకోసం అంత మొత్తం ఖర్చుపెట్టగల తాహత్తు మాకులేదు. మా ఆర్థిక పరిస్థితులు నీకు తెలియనివిగావు. ఆస్తిలో సగం అన్నా అమ్మితేగాని అంత డబ్బురాదు. అదికాస్తా అమ్మి సీటుకోసం ధారపోస్తే ఇంక ఏంపెట్టి చదవాలి? మా కుటుంబం ఏంతిని బ్రదకాలి? మా తమ్ముళ్ళ భవిష్యత్తు ఏంగావాలి?"

"మరి అయితే......?"

మధ్యలో అడ్డొస్తూ అడిగాడు రామారావు. "మన కాలేజీరోజులు, ఆనాటి మన ఆశలు, ఆశయాలు, ఉపన్యాసాలు గుర్తున్నాయా?"

తల ఊపాను!

"వరకట్నాలకు నేను బద్ధవ్యతిరేకినని కూడా నీకు తెలిసిందేకదా!"

"అవును." అన్నాను సందేహిస్తూనే.

"మరి అప్పట్లో అన్ని ఉన్నతాదర్శాలను అభిమానించి, ఆచరణలో పెట్టనుంకించిన నేను పదిహేను వేలు కట్నంపుచ్చుకుని అంతవరకూ ముక్కూ, మొహం ఎరుగని ఓ మనిషిని వివాహమాడానంటే, అందుకుగల కారణాలేమై ఉంటా యనుకున్నావు?"

నిర్ఘాంతపోయాను నేను. రామారావుతో రేగిన విపరీత పరిణామాలకు కారణ మిదా? రామారావుకు జీవితం నేర్పిన ప్రథమ పాఠమిదా?

కళ్ళముందు ప్రకృతి మాయమై చీకటి జడలు విరియబోసుకుని విలయనృత్యం చేస్తూన్నది. క్షణకాలమలా నిశ్చేష్టుడనై ఆచీకటిలోకి చూస్తూ ఉండిపోయాను.

అంతలో నా గతం గుర్తుకువచ్చింది. నేనూ రామారావులా కలలుగన్నవాడినే. భవిష్యత్తును గురించి ఆశ లల్లుకున్నవాడినే. డబ్బు చాలక చదువు చాలించి ఉద్యోగంలో చేరాను గాని. మా యిద్దరినీ పోల్చి చూచుకున్న కొద్దీ రామారావుపట్ల నాకు గల సందేహపు పొరలు తొలగి అతనిపై ఒక విధమైన జాలి కలుగజొచ్చింది!

"కాని రామారావూ! నీకు జరిగిన అన్యాయానికి ఇక్కడ, యీ ప్రజల దగ్గర బదులు వసూలు చేయటం భావ్యమా?" అన్నాను అనునయంగా.

జవాబుగా రామారావు చిరునవ్వునవ్వాడు, "నువ్వింకా అడ్డుదారినే ఉన్నావు నారాయణా. ఓసారి పట్నాలలో పెద్దపెద్దజీతాలు పుచ్చుకునే పెద్ద, పెద్ద డాక్టర్లు చేస్తున్నదేమిటో చూడు." అన్నాడు.

నాకేం పాలుపోలేదు. "సరే! బాగా పొద్దుపోయింది. ఇంక వెడదాం పద." అని లేచాను.

చీకటిపడి చాలా సేపయింది. పైన మబ్బుల చాటున చంద్రవంక చుక్కలతో దోబూచులాడుకుంటూన్నది. చెరువుమీదినుంచి చల్లగాలి వీస్తూన్నది.

ఇద్దరం మౌనంగా నడుస్తున్నాం. కొంతదూరం వెళ్లాక రామారావును నెమ్మదిగా వెళ్తూండమని చెప్పి పొదల మాటుకు తప్పుకున్నాను.

కొద్దిక్షణాల తరువాత మరుగు ప్రదేశంనుండి యివతలికి వస్తూ దూరంగా ఏదో గలభా వినిపించి ఆగిపోయి ఆ దిక్కుగా చూశాను.

దూరంగా మామిడితోటకు ఇవతలగా ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతున్నారు. మేఘాలు అడ్డు రావటంవల్ల వెలుగు సరిగాపడక మనుష్యులు స్పష్టంగా కనుపించటంలేదు. కాని అందులో ఒక వ్యక్తి రామారావేనని లీలగా తోచింది. ఇంతలో చంద్రకాంతి అటు ప్రసరించి మనుషులు స్పష్టంగా కనుపించారు. సందేహం లేదు. అతను రామారావే. ఆ రెండో వ్యక్తి మొహం సరిగా కనుపించటంలేదు. మనిషి బలంగా ఉన్నాడు. చంద్రకాంతిలో ఉబ్బిన అతని కండరాలు తళుక్కుమంటున్నాయి. అతన్నింతకుముం దెక్కడో చూచినట్లనిపించింది. అతను...అతను...సాయంత్రం రామారావు సాయం కోరుతూ వచ్చిన వ్యక్తి. మిల్లులో కూలీ. రామదాసు నౌఖరు.

సాయంత్రం పోతూ, పోతూ అతను చూసిన చూపులోని వేగం గుర్తుకువచ్చి నిలువెల్ల వణికిపోయాను.

అతను ఒక చేత్తో రామారావు చొక్కా కాలరు మెలేసి పట్టుకున్నాడు. రెండో చేతిలో వెన్నెలలో తళతళ మెరిసిపోతున్న బాకున్నది. పరిస్థితి అర్థమై నా గుండె వేగంగా కొట్టుకో సాగింది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తల తిరిగిపోసాగింది.

అతనలా బాకు రామారావు గుండెల కానించే ఉన్నాడు. ఇంతలో రామారావు "సరే అలాగే వస్తా?" ననటం వినిపించింది. అతను రామారావును వదలి మరుక్షణంలో ఆ చెట్టుచాటున చీకట్లో మాయమయ్యాడు.

మరి కొద్దిక్షణాలాగి పొదలమాటునుండి ఇవతలికి వచ్చి రామారావును కలుసుకున్నాను. నాకా ఘర్షణ విషయం తెలిసినట్టు రామారావుకు తెలియటం నా కిష్టం లేదు.

దారిలో ఎవరం మాట్లాడలేదు. ఇద్దరం మౌనంగా నడుస్తూ చెరువుగట్టు దాటి ఊళ్ళో ప్రవేశించాం. ఆ చీకట్లో రోడ్డు కిరువేపులా ఉన్న ఇళ్లూ, మట్టిగోడలూ అక్కడక్కడా తుమ్మకంపలూ నల్ల ముసుగేసుకు నిద్రిస్తున్న కొండదెయ్యాల్లా భీతికొల్పుతున్నాయి. ఎక్కడో మారు మూలన లాంతరుస్థంభం మీద మినుకు మినుకుమనే వెలుగు మాత్రం కనుపిస్తున్నది. అలాగే నెమ్మదిగా నడుస్తూ ఇంటికి చేరుకున్నాం. ఇంటికి చేరుకున్నాక గాని చంద్రుడికి మబ్బులు అడ్డు తొలగి వెలుగురేఖ లిటు ప్రసరించలేదు. మా హృదయాలు శాంతించలేదు.

ఇంటికి చేరుకున్న కాసేపటి ఒంటెద్దు బండొకటి వచ్చి గేటుముం దాగింది. మధ్యాహ్నం నేను వచ్చిన బండే అది. కాని, బండివాడు మాత్రం అతను గాదు. ఇతనెవరో కుర్రవాడు.

రామారావు లోపలికివెళ్లి బ్యాగూ, సైతస్కోపు తీసుకువచ్చి "సారీ నారాయణా. అర్జంటు కేసొకటి వచ్చింది. వెంటనే తిరిగి వస్తాను. నువ్వు కాసేపు ఆ పేపరు చదువుతూ ఉండు." అంటూ నా జవాబుకు ఆగకుండానే బ్యాగు ఆ కుర్రవాడికిచ్చి బండెక్కి వెళ్ళాడు

రామారావు తిరిగివచ్చేసరికి చాలా ప్రొద్దుపోయింది. ఇద్దరం భోజనాలు ముగించి బయట వెన్నెలలో మంచాలేసుకొని పడుకున్నాం. చాలా సేపు మౌనంగా గడచి పోయింది. రామారావు పట్నం సంగతులు ఏవో అడిగాడు. నేను చెప్పాను. కాని, ఆ సంభాషణలో ఉత్సాహం లేదు. జీవం లేదు. మరి కాసేపటికి రామారావు నిద్రలోపడ్డాడు.

నాకెంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. మనస్సు అల్లకల్లోలంగా ఉన్నది. నేనూహించుకున్న దేమిటి? వచ్చి చూసిందేమిటి?

ఆ రాత్రల్లా నాకు నిద్రలేదు.

మర్నాడే రామారావు ఎంత బలవంతం చేస్తున్నా వినకుండా ఏవేవో సాకులుచెప్పి బయలుదేరి వచ్చాను.